సాక్షి
జోగుళాంబ గద్వాల
మంగళవారం, 14, మే, 2024



..రాములోరి కల్యాణం

జీచుపల్లిలో సోమవారం సీతారాముల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



తేనెటీగల దాడి

వటువర్లపల్లిలో ఓటర్లపై తేనెటీగలు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.2 /21.5

ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం తోపాటు ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమవుతుంది.

నాగర్‌కర్నూల్‌లో 69.01 %, మహబూబ్‌నగర్‌లో 71.66 %

- గత ఎన్నికలతో పోలిస్తే రెండు స్థానాల్లోనూ పెరిగిన ఓటింగ్ శాతం
- బ్యాటరీ పరిశ్రమ వద్దంటూ ఎదిరలో గ్రామస్తుల ఎన్నికల బహిష్కరణ
- గుట్ట మైనింగ్ అనుమతులు నిలిపియాలని మైలారం వాసులు సైతం
- అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ సైలెంట్‌గా క్రాస్ ఓటింగ్..!
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- భారీ భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంల తరలింపు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే.. జూన్ 4న ఓట్ల లెక్కింపు

● ముగిసిన లోక్‌సభ ఎన్నికలు

ఓటెత్తారు..!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి నాగర్‌కర్నూల్

లోక్‌సభ ఎన్నికల పోరు ముగిసింది. ఓటర్లు తమ తీర్పును ఇచ్చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో సోమవారం ఉదయం ఏడు గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ క్రమక్రమంగా పుంజుకుంది. నిర్దేశిత సమయం సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసే నాటికి మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో 71.66 శాతం, నాగర్‌కర్నూల్‌లో 69.01 శాతం పోలింగ్ నమోదైంది. మహబూబ్‌నగర్ పరిధిలో పోలింగ్ ముగిసిన వెంటనే సిబ్బంది ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో పాటు ఎన్నికల సామగ్రిని పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో, నాగర్‌కర్నూల్ పరిధిలో జిల్లాకేంద్రంలోని నెల్లికొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా.. అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు. రెండు లోక్‌సభ సెగ్మెంట్లలో సైలెంట్‌గా క్రాస్ ఓటింగ్ కొనసాగినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

స్వల్ప తోపులాట..

మక్తల్ నియోజకవర్గ పరిధిలోని ఉట్కూరు మండలం మల్లెపల్లి, నారాయణపేట సెగ్మెంట్‌లోని కోయిల్‌కొండ మండలం మల్కాపూర్, పెర్కివీడు గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చారు.

ఎదిర వాసుల పోలింగ్ బహిష్కరణ

మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని నాలుగో వార్డుకు చెందిన ఎదిర వాసులు పోలింగ్‌ను బహిష్కరించారు. ఈ వార్డు సమీపంలో అమరరాజా బ్యాటరీ పరిశ్రమకు కొన్ని నెలల క్రితం శంకుస్థాపన చేశారు. కాలుష్యంతో తమ బతుకులు ఆగమవుతాయంటూ అమరరాజా బ్యాటరీ పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి పేరిట స్థానికులు కొన్ని రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలంటూ తీర్మానించుకున్న వారు సోమవారం పోలింగ్‌ను బహిష్కరించారు. అధికారులు వచ్చి సముదాయించినా.. సాయంత్రం వరకు స్పందించలేదు. ఇక్కడ మొత్తం 3,300 ఓట్లు ఉండగా.. 130 ఓట్లు పోలైనట్లు సమాచారం.



ధరూరులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు

పోలింగ్ అంచనాలు (శాతాల్లో)..

మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్
10.33%	9.81%
26.99%	27.74%
45.84%	45.15%
58.92%	57.17%
68.04%	66.21%
71.66%	69.01%

పెరిగిన పోలింగ్ శాతం..

➡ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కొడంగల్, షాద్‌నగర్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 16,82,470 మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం ఆరు గంటల వరకు 71.66 శాతం ఓట్లు పోయ్యాయి. గత ఎన్నికల్లో 65.38 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ సారి 6.28 శాతం ఓటింగ్ పెరిగింది.

➡ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అచ్చంపేట. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, గద్వాల, అలంపూర్, వనపర్తి అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 17,38,254 మంది ఓటర్లు ఉండగా, 69.01 శాతం ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో 62.23 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ సారి 6.78 శాతం ఓటింగ్ పెరిగింది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మహబూబ్‌నగర్ లోక్‌సభలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటింగ్ శాతం (సా.6 గంటల వరకు) అంచనా..

అసెంబ్లీ స్థానం	పోలింగ్ శాతం
మహబూబ్‌నగర్	65.35
దేవరకద్ర	73.47
జడ్చర్ల	76.70
షాద్‌నగర్	76.42
మక్తల్	70.85
నారాయణపేట	68.71
కొడంగల్	70.14

నాగర్‌కర్నూల్ లోక్‌సభలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటింగ్ శాతం (సా.6 గంటల వరకు) అంచనా..

అసెంబ్లీ స్థానం	పోలింగ్ శాతం
అచ్చంపేట	62.70
నాగర్‌కర్నూల్	63.56
కొల్లాపూర్	64.00
కల్వకుర్తి	72.51
అలంపూర్	71.23
గద్వాల	74.93
వనపర్తి	66.56



ధరూర్ మండలం నెట్టెంపాడు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సూచనలిస్తున్న ఎస్పీ రితిరాజ్



చిన్నతాండ్రపాడులో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్



చాగదోన పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఈవీఎంల మొరాయింపు..

❒ కొడంగల్ నియోజకవర్గం మద్దూరు మండల కేంద్రంలోని పోలింగ్‌స్టేషన్ 67లో సాంకేతిక సమస్యతో ఈవీఎం మొరాయించింది. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఓటు వేయడానికి వచ్చిన వాళ్లు అసహనంతో తిరిగి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12 తర్వాత మరో ఈవీఎంను ఏర్పాటు చేయగా.. పోలింగ్ తిరిగి ప్రారంభమైంది. ఇదే మండలంలోని కొత్తపల్లి పోలింగ్‌స్టేషన్ 101లో, 83లో సైతం ఈవీఎంలు మొరాయించాయి. కానుకుర్తిలోని 69వ బూత్‌లో అరగంట పాటు ఆలస్యంగా ఆరంభమైంది.

❒ జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్‌లోని పోలింగ్ స్టేషన్ 81లో ఉదయం 11:30 గంటలకు ఈవీఎం మొరాయించింది. అధికారులు వెంటనే మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. మిడ్జిల్ మండలం వేముల గ్రామంలోని 255 పోలింగ్ సెంటర్‌లో వీవీ ప్యాట్ మొరాయించగా.. అధికారులు సరిచేశారు. నవాబుపేట మండలంలోని లింగంపల్లి పోలింగ్ స్టేషన్ 15లో ఉదయం 7.15 గంటలకు కరెంట్ పోయింది. సుమారు 20 నిమిషాల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అప్పటి వరకు పోలింగ్ సిబ్బంది టార్చిలైట్ వెలుతురులో పోలింగ్ కొనసాగించారు.

❒ మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండలం కున్సిలోని పోలింగ్‌స్టేషన్ 74లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈవీఎం సతాయించింది. గంట పాటు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. ఉట్కూర్‌లోని 37,38 బూత్‌లలో అరగంట పాటు ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు సాంకేతిక లోపాన్ని సరి చేయడంతో ఓటింగ్ కొనసాగింది.

❒ దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం కానాయపల్లిలోని పోలింగ్ స్టేషన్ 260లో ఈవీఎం మొరాయించింది. గంట తర్వాత ఆన్ కావడంతో పోలింగ్ కొనసాగింది. భూత్పూరు మున్సిపాలిటీలోని తొమ్మిదో బూత్‌లో కాసేపు ఈవీఎం మొరాయించింది. అధికారులు సరిద్ది వెంటనే పోలింగ్ ప్రారంబించారు.

❒ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనూ పలుచోట్ల మాత్రం ఈవీఎం మొరాయింపుతో పోలింగ్ ఆలస్యమైంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం గంగన్‌పల్లిలో, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వరబావిలోని రెండు పోలింగ్‌కేంద్రాల్లో, ఊర్కొండ మండలం రాంరెడ్డిపల్లిలో ఈవీఎం మొరాయింపుతో పోలింగ్ ఆలస్యమైంది. కొద్దిసేపటి తర్వాత అధికారులు ఈవీఎం మిషన్లను పునరుద్ధరించడంతో పోలింగ్ ప్రారంభమైంది

అభ్యర్థుల సందర్శన..

⇨ పెబ్బేరులోని 204, 206 పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవి సందర్శించారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

⇨ పెబ్బేరులోని 203, 205 పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఏజెంట్లు ఉండకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని, మరికొన్నిచోట్ల ఓట్లు వేయడానికి వెళ్లనివ్వడం లేదన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.



పెబ్బేరులోని పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి

జిల్లాలో..

● కలెక్టర్ బీఎం సంతోష్ తన ఓటుహక్కును గద్వాల వేణుకాలనీలోని 215పోలింగ్ కేంద్రంలో, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆయన భార్య మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి వారి సొంత గ్రామం బూరెడ్డిపల్లెలో, గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ గద్వాలలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి మాజీ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉండవెల్లి మండలం పుల్లూరులో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మానవపాడు మడలం జల్లాపురంలో జెడ్పీచైర్‌పర్సన్ సరిత కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే, అయిజ మండలం చిన్నతాండ్రపాడులో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఇటిక్యాల మండలంలో కొండేరులో మాజీ ఎంపీ మందా జగన్నాథం, ఆయన కుమారుడు మందా శ్రీనాథ్ ఓటు వేశారు. అలాగే, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కుమార్తె స్వేచ్ఛ అమెరికా నుంచి అలంపూర్‌కు చేరుకొని మొ దటి సారి ఓటు హక్కు వినియోగించుకుంది.

● జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సోమవారం నల్లకుంటలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అయితే పోలింగ్ కేంద్రంలో బీజేపీ పార్టీ గుర్తుతో కూడిన పోల్‌చీటీ కనిపించడంతో విషయాన్ని కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

● అయిజ పట్టణం 69పోలింగ్ కేంద్రంలో ఉదయం అర గంట వరకు ఈవీఎం మిషన్ మొరాయించింది. మరమ్మతు చేయడంతో అనంతరం ప్రారంభించారు.

● జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ రితిరాజ్ పర్యవేక్షించారు. జిల్లాలోని సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు అక్కడి సిబ్బందికి సూచనలు ఇస్తూ పటిష్ఠ చర్యలు తీసుకున్నారు.

● పోలింగ్ ముగిసిన అనంతరం ఓటర్ల తీర్పుతో నిక్షిప్తమైన ఈవీఎంలు, వీవీప్యాట్ కంట్రోల్ యూనిట్స్‌ను ఎన్నికల నిర్వహణ అధికారులు తిరిగి పంపిణీ కేంద్రానికి తరలించారు. కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో పీఓలు, ఏపీఓలు, సెక్టోరియల్, తహశీల్దార్‌ల సమక్షంలో ఆర్డీఓ రామచందర్ పర్యవేక్షణలో వాటిని అందజేశారు.



అమెరికా నుంచి వచ్చి అలంపూర్‌లో ఓటు వేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుమార్తె స్వేచ్ఛ

ఓటేసిన ప్రజాప్రతినిధులు..

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరులో బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, ఎంపీ రాములు కుటుంబసభ్యులతో కలసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలంపూర్ నియోజకవర్గకేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కొల్లాపూర్ పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు,వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం తిర్మలాపూర్‌లో రాష్ట్ర ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తిలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, తెలకపల్లి మండలం గౌరారంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, గద్వాల పట్టణంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఉండవెల్లి మండలం పుల్లూరులో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఓటువేశారు.

సిరా మార్కు చూపుతున్న వృద్ధురాలు



సైలెంట్‌గా 'క్రాస్' ఓటింగ్ !

జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్‌తో పాటు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ స్థానాల్లో సైలెంట్ ఓటింగ్ కొనసాగినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి 31 మంది, నాగర్‌కర్నూల్‌లో 19 మంది బరిలో ఉన్నారు. ఈ రెండు స్థానాల్లోనూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే పోరు కొనసాగింది. ఉదయం మందకొడిగా.. తొమ్మిది తర్వాత కొంత పుంజుకోవడం.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి తగ్గడం.. చివరి రెండు గంటల్లో అధిక సంఖ్యలో ఓటర్లు బారులుదీరిన క్రమంలో సైలెంట్ ఓటింగ్ కొనసాగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో క్రాస్‌ఓటింగ్ జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా రెండు పార్టీల అభ్యర్థుల మధ్యే పోరు కొనసాగింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో డీలా పడ్డ పార్టీకి చెందిన ఓట్లు వేరే పార్టీ అభ్యర్థికి క్రాస్ అయినట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సైతం చోటుచేసుకున్నట్లు జిల్లాలో చర్చ జోరుగా సాగుతోంది.



కల్వకుర్తి మండలం గుండూరులో ఓటుహక్కు వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్

స్ట్రాంగ్‌రూంకు చేరిన ఈవీఎంలు

నాగర్‌కర్నూల్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పూర్తి అనంతరం జిల్లా కేంద్రంలోని రీసివింగ్ సెంటర్‌లో ఈవీఎంలను ఎన్నికల సిబ్బంది అప్పగించారు. అక్కడి నుంచి ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంకు తరలించి భద్రపరిచారు.



అలంపూర్ చౌరస్తాలోని పంపిణీ కేంద్రంలోకి చేరిన ఓటరు తీర్పుతో నిక్షిప్తమైన ఈవీఎంలు

ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటుతోనే సాధ్యం



అలంపూర్‌లో సిరా మార్కు చూపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అలంపూర్: ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటుతోనే సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అలంపూర్ హరిజనవాడ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఆయన సోమవారం తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అనంతరం మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును సొంతగడ్డ అలంపూర్‌లో వినియోగించుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా వృథా కావద్దన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం.. రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసం ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తన ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

బతికుండగానే ఓటు తీసేశారని వృద్ధురాలి ఆందోళన

నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మరికల్ మండలం రాకొండ గ్రామంలో వృద్ధురాలు లక్ష్మమ్మ పోలింగ్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఓటు వేసేందుకు సెంటర్ వద్దకు రాగా, ఓటరు జాబితాలో ఆమె పేరు లేదు. దీంతో ఆ వృద్ధురాలు పోలింగ్ సిబ్బందితో వాదనకు దిగింది. తాను బతికే ఉన్నానని.. ఎందుకు ఓటును తీసేశారంటూ ఆగ్రహంతో సెంటర్ నుంచి బయటకు వచ్చి గేటుకు తాళం వేసింది. పోలీసులు సెంటర్ వద్దకు వచ్చి ఆమెను సముదాయించారు. అనంతరం సెంటర్ గేటును తెరిచారు. – మరికల్



పోలింగ్ కేంద్రాల పరిశీలిన

గట్టు: మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సోమవారం ఏఎస్పీ గుణశేఖర్, సౌబర్ క్రైం డీఎస్పీ సత్తయ్య పరిశీలించారు. తుమ్మలచెరువు, ఆలూరు, రాయాపురం, గట్టు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ చేరుకొని పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పోలీస్ బందోబస్తు తదితర విషయాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.



గట్టులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ గుణశేఖర్

ఎన్నికలను బహిష్కరించిన మైలారం ఓటర్లు

- మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్
- గ్రామస్తులతో ఆర్డీఓ చర్చలు
- భారీగా పోలీసు బందోబస్తు



– బల్మూర్

వివరాలు 8లో ▸

ఎన్నికలను బహిష్కరించిన

ఎదిర వాసులు

లిథియం అయాన్ గిగా అమరరాజా కంపెనీ ఏర్పాటుకు నిరసన

- కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీతో ఆర్డీఓ చర్చలు విఫలం
- వెలవెలబోయిన పోలింగ్ బూత్ నం.94, 95
- ఓటేయని 3వేల పైచిలుకు ఓటర్లు



ఎదిర జెడ్పీహెచ్ఎస్ లో ఓటర్లు లేక వెలవెలబోతున్న పోలింగ్ కేంద్రం నం.94, 95

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక నాలుగో వార్డు పరిధిలోని ఎదిర వాసులు సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు. దివిటిపల్లి ఐటీ టవర్‌లో ఏర్పాటు చేస్తున్న లిథియం అయాన్ గిగా (అమరరాజా కంపెని)ను వేరే చోటకు తరలించాలని 59 రోజులుగా కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన ప్రదర్శనలు వ్యక్తం చేస్తున్నారు. అయినా పాలకులు, అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు తాజాగా ఈ ఎన్నికల్లో ఓటేయలేదు. దీంతో ఎదిర జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు (నం.94, 95, 96) వెలవెలబోయాయి. ఈ పీఎస్‌ల పరిధిలో 3,299మంది ఓటర్లు ఉండగా, హౌసింగ్‌బోర్డుకు చెందిన 128 మందితో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు 24 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా ఈ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్డీఓతో చర్చలు విఫలం

విషయం తెలుసుకున్న ఆర్డీఓ ఈ.నవీన్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరాం మధ్యాహ్నం ఎదిరలో దీక్ష శిబిరం వద్దకు వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలని, త్వరలో అందరితో కలిసి సమావేశం నిర్వహించి తగు న్యాయం చేస్తామన్నారు. అమరరాజా కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులతో అర గంట పాటు చర్చలు జరిపినా ఎలాంటి ప్రయోజనం దక్కలేదు. ఇక్కడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నా వారు పట్టించుకోలేదు. కాలుష్య కారక పరిశ్రమ వద్దంటూ నినాదాలు చేశారు. ఈ కంపెనీ వల్ల తమ భవిష్యత్ నాశనమవుతుందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ కంపెనీని మూసివేయాల్సిందేనని ఆ మేరకు వెంటనే కలెక్టర్ రవినాయక్ వచ్చి లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలన్నారు. అప్పుడే ఎన్నికల్లో పాల్గొంటామని తెగేసి చెప్పడంతో చేసేదేమీ లేక ఇద్దరు అధికారులు వెనుదిరిగారు.

ఫ్యాక్టరీ తీసేస్తేనే మంచిది..



గాలి, నీరు కాలుష్యమయ్యే బ్యాటరీ ఫ్యాక్టరీ తీసేస్తేనే మంచిది. దీని కోసం రెండు నెలలుగా గ్రామస్తులందరం కలిసి నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం తగదు. మా ఇంట్లో ఆరుగురు ఉంటాం. నా ఇద్దరు కొడుకులు, నేను ప్రైవేట్‌గా చిన్న ఉద్యోగం చేసుకుని బతుకుతున్నాం. అమరరాజా కంపెనీ ఏర్పాటుతో అన్ని విధాలా మాకు నష్టమే కలుగుతుంది. గ్రామస్తుల నిర్ణయం మేరకు తప్పని పరిస్థితుల్లోనే ఓటింగ్‌లో పాల్గొనలేక పోయాం.

– టి.హనుమంతు, హరిజనవాడ, ఎదిర

మేం చస్తే.. మా పిల్లలు ఏం కావాలి?



సమీపంలోని అమరరాజా కంపెనీ ఏర్పాటుతో ఇబ్బందులు తప్పవు. ఒక వేళ మేం చస్తే.. మా పిల్లలు ఏం కావాలి? వేరే గ్రామాలకు వెళ్లి కూలినాలి పనులు చేసి బతుకులు ఈడుస్తున్నాం. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్ తలసుకుంటే భయమేస్తుంది. ఈ కంపెనీ వెదజల్లే కాలుష్యంతో అనారోగ్యం బారిన పడతాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి నుంచి దీనిని తొలగింపజేయాలి. ఎన్ని ఆందోళనలు చేసినా వారి చెవికెక్కడం లేదు. అందువల్లే ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్నాం.

– సత్యమ్మ, వ్యవసాయ కూలీ, ఎదిర

బ్యాటరీ కంపెనీ వద్దే.. వద్దు



దివిటిపల్లిలోని ఐటీ పార్కులో అమరరాజా బ్యాటరీ కంపెనీ వల్ల మాకు అన్నీ ఇబ్బందులే ఎదురవుతాయి. కాలుష్య కారక పరిశ్రమతో ఈ గ్రామం విడిచి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది. మేము తాగే నీళ్ల, చివరకు గొర్లకు అపాయమే కలుగుతుంది. ఈ విషయమై రెండు నెలలుగా అధికారులకు, పాలకులకు చెబుతున్నా వారి చెవికెక్కడం లేదు. మా బతుకులతో ఆడుకుంటున్నారు. అందువల్లే ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడం లేదు. నేను కూలీనాలి చేసుకుని జీవనం సాగిస్తున్నా.

– నారాయణ, వ్యవసాయ కూలీ, కుర్వగేరి, ఎదిర

మైలారం ఓటర్లు



మైలారం గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న ఆర్డీఓ మాధవి

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

- మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్
- గ్రామస్తులతో ఆర్డీఓ చర్చలు
- భారీగా పోలీసు బందోబస్తు

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గుట్టపై తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలంటూ గ్రామస్తులు సోమవారం పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఆర్డిఓ మాధవి ఉదయం 8 గంటలకు గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో చర్చలు జరిపారు. మైనింగ్ అనుమతులు రద్దు చేస్తామని మౌఖికంగా హామీ ఇవ్వగా అందుకు గ్రామస్తులు ఒప్పుకోలేదు. రాత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో చేసేది లేక ఆమె వెనుదిరిగారు. తిరిగి మధ్యాహ్నం మరోమారు గ్రామానికి చేరుకుని ఓటింగ్‌లో పాల్గొనాలని గ్రామస్తులను కోరగా వారు తమ నిర్ణయంలో మార్పు లేదని తేల్చి చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయి.

పరిస్థితిని పర్యవేక్షించిన ఏఎస్పీ..

గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించడంతో అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ రవీందర్, ఎస్‌ఐ బాలరాజు సిబ్బందితో గ్రామంలో 144 సెక్షన్ విధించారు. పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ రామేశ్వర్‌రావు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.



మైలారంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు

పోలింగ్‌లో పాల్గొన్న ఆరుగురు ఓటర్లు..

గ్రామస్తులంతా ఎన్నికలను బహిష్కరించగా సాయంత్రం 4.30 ప్రాంతంలో ఇద్దరు ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం ముగిసే సమయానికి మరో నలుగురు ఓటర్లు మొత్తం ఆరుగురు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా గ్రామంలో పురుష ఓటర్లు 449, మహిళా ఓటర్లు 334 మంది మొత్తం 783 మంది ఉన్నట్లు పోలింగ్ అధికారి ఆంజనేయులు తెలిపారు. ఎన్నికలు బహిష్కరించిన విషయం సామాజిక మధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.

అమరగిరి సమస్యలు పరిష్కరించాలని..

- రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు
- తహసీల్దార్ సర్దిచెప్పడంతో కొనసాగిన పోలింగ్

కొల్లాపూర్: కొల్లాపూర్ మండలంలోని అమరగిరి గ్రామ ప్రజలు సోమవారం ఉదయం రెండు గంటల పాటు పోలింగ్‌ను బహిష్కరించారు. తమ గ్రామానికి నాలుగు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిందని, గ్రామానికి వచ్చే రోడ్డును బాగుచేయాలని, తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోలింగ్‌ను బహిష్కరించిన విషయం తెలియడంతో తహసీల్దార్ శ్రీకాంత్ గ్రామానికి చేరుకొని వారితో మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులను పిలిపించి కరెంట్ సప్లయ్ పునరుద్ధరించారు. మిగిలిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్దిచెప్పడంతో గ్రామస్తులు శాంతించి ఓటింగ్‌లో పాల్గొన్నారు.



పోలింగ్‌కు రాకుండా రోడ్డుపై కూర్చున్న అమరగిరి గ్రామస్తులు

క్లుప్తంగా

ఓటేసి వచ్చి హఠాన్మరణం



గొల్ల రాజు (ఫైల్)

అడ్డాకుల: పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి అరగంటలో హఠాన్మరణం చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. మూసాపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గొల్లరాజు(48) మధ్యాహ్నం ఆయన ఇంటి ముందున్న పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటు వేసి ఇంటికి వచ్చి భోజనం చేసిన కొద్ది సేపటికే హఠాన్మరణం చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న బైక్

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



విష్ణువర్ధన్‌గౌడ్ (ఫైల్)

కోస్గి: ఓటేసి స్నేహితులతో కలిసి పట్టణానికి వచ్చిన ఓ యువకుడు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వికారాబాద్ జిల్లా బిచ్చాల్ చెందిన విష్ణువర్ధన్‌గౌడ్(20) అదే గ్రామానికి చెందిన స్నేహితులు భాస్కర్, రవితో కలిసి బైక్‌పై కోస్గికి వచ్చారు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మండలంలోని ముశ్రీఫా శివారులో బైక్ అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో విష్ణువర్ధన్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108లో పాలమూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తొలిసారి ఓటు వేసిన ఓటర్ల మనోగతం



జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాలలో తొలిసారి ఓటు వేసిన యువకులు



జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాల గ్రామంలో తొలిసారి ఓటు వేసిన అక్కాచెల్లెళ్లు

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారి ఓటు వేసిన ఓటర్లు కొత్త కొత్తగా, గర్వంగా ఉందంటూ మనోగతాన్ని వెల్లడించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకుడికి రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది. తొలిసారిగా ఓటరుగా నమోదై ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చిన పలువురు యువ ఓటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

కొత్తగా..



నాకు తెలివి వచ్చాక ఎన్నికలు కుటుంబ సభ్యులు ఓటేసేందుకు వెళ్తుంటే నేను ఎప్పుడు ఓటు వేస్తానా అనే ఆతృత ఉండేది. ఇప్పుడు ఆతృత తీరింది. తొలిసారిగా ఓటు వేయటం కొత్తగా ఉంది. అమ్మతోపాటు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఇలా ఓటు వేయటం ఉత్సాహంగా అనిపించింది.

–నందిని, యువతి, కావేరమ్మపేట

గర్వంగా..



ఓటు హక్కు వచ్చాక తొలిసారిగా ఓటు వేయటం గర్వంగా ఉంది. ఇంట్లో, చుట్టుపక్కల అందరూ ఓటు వేయటానికి వెళ్తుంటే నేనెప్పుడు వెళ్తానా అని మనసులో అనుకునేదాన్ని. ఇప్పుడు అవకాశం వచ్చింది. ఎప్పుడెప్పుడు ఓటు వేస్తానా అని ఉదయం నుంచి ఉత్సాహంగా ఉంది. తొలిసారిగా ఓటు వేసినందుకు చాలా గర్వంగా అనిపించింది.

–సుచిత్ర, ఎంబీఏ విద్యార్థిని, జడ్చర్ల

పోలింగ్ సిబ్బంది బస్సులో సాంకేతిక లోపం



బస్సు వద్ద బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

ఆత్మకూర్: అమరచింత మండలంలోని నందిమళ్ల, మస్తీపురం, సింగంపేట, ఆత్మకూరు మండలంలోని ఖానాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత సిబ్బందిని, సామగ్రిని జిల్లా కేంద్రానికి తరలిస్తున్న వాహనం సాంకేతిక లోపంతో మొరాయించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సిబ్బందిని తరలించే బస్సు సోమవారం రాత్రి పది గంటల సమయంలో ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌కు రాగానే గేర్ బాక్స్‌లో ఇబ్బందులు తలెత్తడంతో అక్కడే ఆగిపోయింది. దీంతో అత్యంత ముఖ్యమైన ఈవీఎం మిషన్లు బస్సులో ఉండడంతో పోలింగ్ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. తక్షణమే స్పందించిన డీఎస్పీ క్రిష్ణకిషోర్, ఆత్మకూర్ సీఐ శివకుమార్, హైదరాబాద్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, అమరచింత ఎస్ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ట భద్రతను కల్పించారు. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ మెకానిక్‌కు సమాచారం అందించామని, అతడు వచ్చి మరమ్మతు చేసిన వెంటనే ఎన్నికల సామగ్రిని సురక్షితంగా తరలిస్తామని తెలిపారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

మన్ననూర్: పోలింగ్ కేంద్రం సమీపంలో బొడ్రాయి వద్ద తేనె టీగలు కొందరు వ్యక్తులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామస్తులు ఓటు వేసేందుకుగానూ పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఓ చెట్టు కొమ్మకు ఉన్న తేనె తెట్టెకు గుర్తు తెలియని అల్లరి మూకలు రాయి విసిరారు. ఈగలు ఒక్కసారిగా సుమారు 30 మందిపై దాడి చేశాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గణేష్, తిరుపతి, మౌనిక, లావణ్య, సింధుల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం ప్రైవేటు వాహనం సాయంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని కుటుంబాల ద్వారా తెలిసింది.

కుక్క దాడిలో పది మందికి గాయాలు

కోడేరు: కుక్క దాడిలో 10 మందికి గాయాలైన సంఘటన మండలంలోని నర్సాయిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాళ్ల చంద్రమ్మ, చిట్టమ్మ, నాగేంద్రమ్మ, ఎదుట్ల లక్ష్మీ, కృష్ణ వీరితో పాటు మరో ఐదుగురు కలిసి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ఓటు వేసేందుకు వెళ్తున్నారు. పిచ్చి కుక్క వారిపై దాడి చేసి గాయపరిచింది. చుట్టు పక్కల వారు చూసి వెంటనే చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'మౌంట్‌బాసిల్' విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మౌంట్‌బాసిల్ పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మౌంట్‌బాసిల్ పాఠశాల విద్యార్థులు సోమవారం విడుదలైన సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఏ–1, 74 మంది ఏ–2, 40 మంది బీ–1, 32 మంది బీ–2 గ్రేడ్‌లు సాధించారు. విద్యార్థిని సాయి ప్రసూనాంబ 491 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో.. కిషోర్ 489, సరయు చందన 487 మార్కులతో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల వైస్‌చైర్మన్ చంద్రకళవెంకటయ్య, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, డైరెక్టర్ శిరీష ప్రవీణ్, సుశాంత్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్య అభినందించారు.

సత్తాచాటిన సమర్థ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని సమర్థ పాఠశాల విద్యార్థులు సీబీఎస్సీ (పదో తరగతి) ఫలితాల్లో సత్తాచాటారు. ఈ మేరకు 30 శాతం విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించారని, 75 శాతం విద్యార్థులు 80 శాతం మార్కులు సాధించారని చెప్పారు. అలాగే పాఠశాలకు చెందిన మోక్షితాంజలి 480, వంశీకరామ్ 478, శ్రీధన్య 475 మార్కులు సాధించారు. ఈ మేరకు మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ నరేంద్రగుప్తా, యాదయ్య, పిన్సిపాల్ శ్రీకాంత్ కోటా తదితరులు అభినందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటం గ్రామ సమీపంలోని శ్రీవారి సముద్రం చెరువులో హరిత హోటల్ సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైందని హెడ్‌కానిస్టేబుల్ నిరంజన్ నాయక్ తెలిపారు. మహిళకు 50 సంవత్సరాలు ఉంటాయన్నారు. ముస్లిం మహిళలా ఉందన్నారు. నల్లజాకిట్, నల్ల లంగా, నల్లపూల చున్ని, బూడిద కలర్ పూల చీర ఉందన్నారు. ఎవరైనా గుర్తుపట్టి ఉంటే కొల్లాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఫోన్ నంబర్ 8712657719ను సంప్రదించాలని తెలియజేశారు.

పిడుగుపడి మిర్చి కుప్ప దగ్ధం



కేటీ దొడ్డి: పిడుగుపడి మిర్చి కుప్ప దగ్ధమైన ఘటన మండలంలోని పాగుంటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు కుర్వ సిద్ధప్ప తనకున్న 4 ఎకరాల పొలంలో మిర్చి సాగు చేశారు. పండిన 45 క్వింటాళ్ల పంటను నిల్వ చేయగా ఆదివారం అర్ధరాత్రి పిడుగుపడి పూర్తిగా దగ్ధమైంది. పంట విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని.. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

పోలింగ్ సరళి వీక్షణ



మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలింగ్ సరళిని ఎన్నికల సాధారణ పరిశీలకులు సేవాంగ్ గ్యాచో భూటియా, కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం నుంచి వెబ్ క్యాస్టింగ్ ద్వారా వీక్షించారు. పోలింగ్ సరళి తీరును పరిశీలించారు.

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి ఆధ్వర్యంలో సీతారాములను అందంగా ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ కనులపండువగా కల్యాణాన్ని జరిపారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం వైఎస్ జగన్, భారతమ్మ

పులివెందుల: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని భాకరాపురంలోని పోలింగ్ కేంద్రంలో తన సతీమణి వైఎస్ భారతి రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఓటు వేశారు. పులివెందులలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి కూడా ఓటు వేశారు. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇడుపులపాయలోని మల్లేలమ్మ తల్లి నగర్‌లో ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల, అనికుమార్ ఓటు వేశారు.




ఓటేసి వచ్చేశారు..

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ ఏర్పడింది. ప్రధానంగా హైదరాబాద్ మార్గంలో వాహనాలు బారులుదీరి వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంట్‌తోపాటు అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్నవారు ఓటు వేసేందుకు సొంతూర్లకు వెళ్లి తిరుగు పయనమవుతున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ మొదలైంది.



పచ్చ ముఠాల విధ్వంసకాండ

ఓటమి భయంతో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఓటమి భయంతో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఫ్యాక్షన్ , రౌడీ మూకలతో కలిసి బీభత్సం సృష్టించారు. కర్రలతో దండెత్తారు. కత్తులతో విరుచుకుపడ్డారు. ఏకంగా బాంబు దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్య ఓటర్లపై యథేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు బరితెగించి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఇళ్లు, వాహనాలపై దాడులకు తెగబడి విధ్వంస కాండతో చెలరేగిపోయారు. సామాన్య ప్రజానీకాన్ని హడలెత్తించారు. పల్నాడు, అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం.. ఇలా దాదాపు అన్ని జిల్లాల్లోనూ విధ్వంసానికి దిగారు. ఈ గొడవలన్నింటికీ కర్త, కర్మ, క్రియ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ, జనసేన పార్టీలు దాదాపు 15 రోజులుగా రాష్ట్రంలో కుట్రలకు తెరతీసిన విషయం తెలిసిందే. ఓటర్లను యథేచ్ఛగా ప్రలోభాలకు గురి చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కవ్విస్తూ దాడులకు పాల్పడుతూ వచ్చాయి. ఆ విధ్వంసకర కుట్రను పోలింగ్ సందర్భంగా సోమవారం పతాక స్థాయికి తీసుకువెళ్లాయి. ఉదయం పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే పోలింగ్ సరళి టీడీపీకి వ్యతిరేకంగా ఉందనే విషయం స్పష్టం కావడంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ బెంబేలెత్తిపోయారు. దాంతో ముందస్తు పన్నాగంతో సిద్ధం చేసిన తమ రౌడీమూకలకు పచ్చ జెండా ఊపారు. ఆ వెంటనే టీడీపీ, జనసేన రౌడీలు యథేచ్ఛగా దాడులకు తెగబడి రాష్ట్ర వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. ఉదయం మొదలైన ఈ దాడులు, దౌర్జన్య కాండ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేలా చూడాల్సిన ఎన్నికల కమిషన్(ఈసీ).. వైఎస్సార్‌సీపీ ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ టీడీపీ, జనసేన గుండాల దాడులపట్ల ఉదాసీనంగా ఉండటం విస్మయ పరుస్తోంది.

హడలెత్తిన టీడీపీ, జనసేన

ప్రతిష్టాత్మకమైన ఈ ఎన్నికల్లో పోలింగ్ సరళి ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ మొదటి నుంచీ వ్యక్తమైంది. సోమవారం ఉదయం పోలింగ్ మొదలు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వారిలో మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉండటం విశేషం. ఆ వర్గాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్నారని జాతీయ చానళ్లతోపాటు అన్ని సర్వేలు వెల్లడించాయి. అంటే ఓటింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందన్నది స్పష్టమైంది. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు.. ఓటింగ్ ప్రక్రియను దెబ్బతీసే కుట్రకు తెరతీశారు. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా లేకపోతే విధ్వంసం సృష్టించేందుకు ముందుగానే ఆ రెండు పార్టీలు పన్నాగం పన్నాయి. అందుకోసం టీడీపీలోని రౌడీ షీటర్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి రౌడీలను ముందుగానే రప్పించాయి. కర్రలు, కత్తులతోపాటు పెట్రోల్ బాంబులు కూడా ముందుగానే సమకూర్చుకోవడం టీడీపీ, జనసేన కుట్రకు నిదర్శనం. చంద్రబాబు ఆదేశించగానే.. టీడీపీ, జనసేన రౌడీలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు తెగబడ్డారు.

చోద్యం చూసిన ఈసీ

టీడీపీ, జనసేన గూండాలు బరితెగించి విధ్వంసానికి పాల్పడి పోలింగ్‌కు ఆటంకులు సృష్టించినా ఎన్నికల కమిషన్(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం నివ్వెర పరుస్తోంది. వారం రోజుల ముందు నుంచే టీడీపీ ఎన్నికల ప్రలోభాలపై వైఎస్సార్‌సీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ప్రధానంగా వుయ్ యాప్ పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుండటంపై పూర్తి ఆధారాలను కూడా సమర్పించింది. టీడీపీ గూండాలు దాడులకు పాల్పడిన ఉదంతాలను.. పోలింగ్ రోజున విధ్వంసం సృష్టించేందుకు పదును పెడుతున్న కుట్రలను కూడా ఈసీ దృష్టికి తీసుకువెళ్లింది. అయినా సరే పోలింగ్ ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ఈసీ పూర్తిగా విఫలమైంది. అసలు టీడీపీ, జనసేన గూండాలు వీధుల్లోకి వచ్చి చెలరేగిపోతున్నా, పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్నా.. ఈవీఎంలను ధ్వంసం చేసినా.. ఏకంగా బాంబు దాడులకు పాల్పడినా సరే ఈసీ మాత్రం క్రియాశీలంగా స్పందించనే లేదు. పైగా వైఎస్సార్‌సీపీ నేతలనే కట్టడి చేసేందుకు యత్నించడం విభ్రాంతి కలిగిస్తోంది.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ముందు ఉన్న కార్లపై కర్రలు, రాళ్లతో దాడిచేస్తున్న టీడీపీ గూండాలు

గుంటూరు జిల్లా తెనాలిలో పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నబత్తున శివకుమార్‌ను టీడీపీ కార్యకర్త గొట్టిముక్కల సుధాకర్ పరుష పదజాలంతో దూషించారు. మాల, మాదిగలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ నోరు పారేసుకున్నారు.

దీనిపై ఎమ్మెల్యే అన్నాబత్తున శివ కుమార్ అభ్యంతరం చెప్పినా వినిపించుకోకుండా మరింతగా దూషించడంతో ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించివేశారు. ఈసీ మాత్రం ఎమ్మెల్యే అన్నా బత్తున శివ కుమార్‌ను పోలింగ్ ముగిసే వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని పోలీసులను ఏకపక్షంగా ఆదేశించడం విస్మయ పరిచింది. ఆయన్ను దూషించిన టీడీపీ కార్యకర్తపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసంపై టీడీపీ రౌడీలు దాడికి పాల్పడి, అక్కడ ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. కానీ ఈసీ మాత్రం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచమని పోలీసులను ఆదేశించడం విడ్డూరంగా ఉంది.

కత్తిపోటు నుంచి బాంబు దాడుల వరకూ..

పోలింగ్ మొదలైన కాసేపటికే టీడీపీ రౌడీలు చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై కత్తితో దాడి చేశారు. అనంతరం పోలింగ్ శాతం పెరుగుతున్న కొద్దీ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన దాడుల తీవ్రతను అమాంతం పెంచుకుంటూ పోయాయి.

బాపట్ల జిల్లా చీరాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్నప్పటికీ ఆమంచి శ్రీనివాస్.. టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్య యాదవ్‌కు అనుకూలంగా పని చేశారు. పోలింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆయన తీవ్ర అసహనానికి గురైన ఆయన రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నేత అంకమ్మగారుపై దాడి చేసి చెంపపై దాడి చేశారు. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య యాదవ్ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు.

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, ఆయన వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో సుధీర్‌రెడ్డికి గాయమైంది. ఎర్రగుంట్ల 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షాహిద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు.

వీరపునాయునిపల్లె మండలంలోని యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. కడపలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ముస్లింలపై టీడీపీ గూండాలు రాళ్ల దాడికి తెగబడ్డాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడకు చేరుకుని ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లంలో టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడటంతో వైఎస్సార్‌సీపీ నేత తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. దప్పేపల్లి గ్రామం మేడిమాకల గుంతరెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజంట్లపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఇదే సమయంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ పార్టీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైమరీ స్కూల్ వద్ద టీడీపీ నాయకులు కండువా, పసుపు చొక్కాలు ధరించి టీడీపీకి ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. దీన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

మచ్చుకత్తితో దాడి

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో స్లిప్పుల పంపిణీ కోసం టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శిబిరం వద్దకు ఓటర్లు వెళ్లడంతో ఓర్చుకోలేని టీడీపీ కార్యకర్త ఇడగొట్టు రంగప్ప మచ్చుకత్తితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంద్రప్పను పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై పేగులు బయటకు వచ్చాయి. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన ఓటర్లు చెల్లాచెదురయ్యారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామంలో పోలింగ్ సరళిని పరిశీలించి తిరిగి వెళ్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఘటనలో పురుషోత్తం రెడ్డి ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఒప్పిచర్లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌లపై హత్యాయత్నం

పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రిలీవ్ ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పాలకీర్తి నరేంద్ర, అతడి తమ్ముడిపై టీడీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశారు. ప్రాణ భయంతో వారు తప్పించుకుని బయటకు పరుగులు తీశారు. దాదాపు 300 మంది టీడీపీ గూండాలు వెంట పడటంతో కారెంపూడి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన అనంతరం పొట్టి శ్రీరాములు కాలనీలోని ఎన్నికల బూత్‌ల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగి రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. కారెంపూడిలోని 288 నెంబర్ బూత్‌లో ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న గోగుల సాంబశివరావు తమ్ముడిపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడడంతో దాడిని అడ్డుకునే యత్నంలో సాంబశివరావు తలకు గాయమైంది. వైఎస్సార్ జిల్లా వేముల మండలం మబ్బుచింతలపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న నూలి భాస్కర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకోవడంతో టీడీపీ వర్గీయులు పథకం ప్రకారం రాళ్ల దాడి చేశారు. కాగా, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో జిల్లా సునంద అనే మహిళకు చేయి విరిగింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

పూతలపట్టులో తెలుగు తమ్ముళ్ల వీరంగం

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మూడు పోలింగ్ బూత్‌లతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై పచ్చ మూక దాడులకు పాల్పడింది. పేటగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవినాయుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సమయంలో టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అనంతరం పేటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుస్వామినాయుడుపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో గురుస్వామి నాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వావిల్‌తోట పంచాయతీ సీఎం కండ్రిగ పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా వున్న హరిబాబుపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే జిల్లా సోమల మండలం కందూరు పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌రెడ్డిపై టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు దాడికి పాల్పడ్డాడు. పోలింగ్ కేంద్రంలో వద్ద ఏర్పడిన వివాదంతో సుబ్రమణ్యం నాయుడు తన అనుచరులతో కలసి దాడి చేశాడు. గంగాధర్ నెల్లూరు మండలం జంగాలపల్లి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు గ్రామస్తులపై దౌర్జన్యం చేశారు. చిత్తూరు మండలం పెరుమాళ్ళ కండ్రిగలో టీడీపీ నాయకులు రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి చేశారు. కారును ధ్వంసం చేసి ఓ నాయకుడిని తీవ్రంగా గాయపరిచారు. తొలుత టీడీపీ నాయకులు ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తూ రోడ్డుకు అడ్డంగా పందిరి వేశారు. దీనిని పోలీసులు తీసి వేయడంతో జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. ఇనుప రాడ్లు, కొయ్యలతో పలువురిని తీవ్రంగా గాయపరిచారు.

పసుపు కండువాతో 'గంటా' హల్‌చల్

భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాతో హల్‌చల్ చేశారు. తన అనుచరులతో కలిసి పోలింగ్ స్టేషన్‌లోకి వెళుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్నపల్లి పోలింగ్ బూత్‌లో ఏజెంట్ల మధ్య తలెత్తిన వివాదం టీడీపీ, వైఎస్సార్‌సీపీల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ జీవరత్నం, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పోలింగ్ బూత్ వద్దకు వెళ్లడంతో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన మల్లాడి చిన ధర్మారావు, మల్లాడి నర్సింహులు, అరదాని శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నేతలు దాడులు చేశారు. రామకృష్ణారావుపేటలో కొందరు టీడీపీ సానుభూతిపరులు చేసిన దాడిలో మాజీ కార్పొరేటర్ రోకళ్ళ సత్యనారాయణతో పాటు మరికొందరు గాయపడ్డారు. రూరల్ కరప మండలం పెదకొత్తూరులో పోలింగ్ బూత్ వద్ద జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీకి చెందిన చింతా సత్యనారాయణపై దాడి చేసి మొబైల్ ఫోన్ లాక్కొని వివాదం సృష్టించారు. పిఠాపురం నియోజకవర్గం విరవ, విరవాడ ప్రాంతాల్లో కూడా జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు.

'చింతమనేని' వర్గీయులు కత్తెరతో దాడి

పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో వైఎస్సార్‌సీపీకి చెందిన చలపాటి రవిపై చింతమనేని అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన రవి భుజంపై కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడిన రవి ఆసుపత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నాడు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆసుపత్రికి చేరుకుని రవిని పరామర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూలులో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా వచ్చారు. అప్పుడే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవ పెట్టుకునేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలపై లాఠీఛార్జి చేశారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ పాఠశాల బూత్‌లో డీఎస్పీ మల్లికార్జునరావు వైఎస్సార్ సీపీకి చెందిన బూత్ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారు. వారి గుర్తింపు కార్డులను లాక్కొని బయటకు వెళ్లాలంటూ ఆదేశించారని బూత్ ఏజెంట్లు ఆరోపించారు.



ఓటేసిన చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి

ఫ్యాన్ సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్ కొనసాగింది. రాత్రి 10 గంటల సమయానికి 76.50 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎండల ప్రభావం తగ్గడం కూడా పోలింగ్ శాతం పెరగడానికి దోహదం చేసింది.

నిర్దేశించేది మహిళలు, గ్రామీణ ఓటర్లే..

పోలింగ్ సరళిపై ఇండియాటుడే ఛానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ సోమవారం రాత్రి టీవీలో చర్చ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను విస్తారంగా పర్యటించానని.. మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజ్‌దీప్ సర్దేశాయ్ పేర్కొన్నారు. ఈ చర్చలో పాల్గొన్న సెఫాలజిస్ట్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించే యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా దీనిపై ఏకీభవించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల ఫలితాలను మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లే నిర్ణయిస్తారని చెప్పారు. రోడ్ల గురించి కాకుండా ప్రభుత్వ సేవలు ఎలా ఉన్నాయన్నదే ప్రామాణికంగా తీసుకుని 80 శాతం మంది మహిళలు ఓటు వేస్తారని తెలిపారు.

ఇంటింటి అభివృద్ధిని ప్రతిబింబించిన పోలింగ్ సరళి..

నవరత్నాల పథకాలను గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు, సుపరిపాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి అభివృద్ధి మరింతగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఓట్లు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారు. ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికలను పెత్తందారులు – పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా బడుగు, బలహీన వర్గాలు భావించడం వల్లే భారీగా పోలింగ్ నమోదైందని పేర్కొంటున్నారు.

మరిన్ని వివరాలు, వార్తల కోసం ఈ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయండి

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు



అచ్చంపేటలో ఓటువేస్తున్న నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు



గౌరారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



తిర్మలాపురంలో ఓటువేసిన జి.చిన్నారెడ్డి



మక్తల్‌లోని 161వ బూత్‌లో ఓటువేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



పుల్లూరులో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు



ఖానాపూర్‌లో ఓటువేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు



మహబూబ్‌నగర్ 103వ పోలింగ్ బూత్‌లో ఓటువేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



దమగ్నాపూర్‌లో ఓటువేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు



ఎల్మపల్లిలో ఓటువేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



రంగారెడ్డిగూడలో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దంపతులు



బూరెడ్డిపల్లిలో ఓటువేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు



ధన్వాడలో ఓటువేసిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



తూడుకుర్తిలో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి